
SRI CITY
An Integrated Business City

స్వాగతం - సుస్వాగతం


శ్రీసిటీలో ఎల్ జి ఎలక్ట్రానిక్స్
భూమిపూజ కార్యక్రమానికి విచ్చేయనున్న
ముఖ్య అతిధులకు
మా హృదయపూర్వక స్వాగత సుమాంజలులు

LG Electronics



శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు

తేదీ : 08-05-2025 (గురువారం)
పరిశ్రమ పెట్టుబడి
5,001 కోట్లు | ఉద్యోగాలు : 6000+



శ్రీ నారా లోకేష్ గారు
మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్, రియల్ టైమ్ గవర్నెన్స్ శాఖామాత్యులు



శ్రీ లీ సియోంగ్-హొ గారు
భారత్ లోని కొరియా రిపబ్లిక్ రాయబారి



శ్రీ జేచియోల్ లియు గారు
CEO, హోమ్ సొల్యూషన్,
LG ఎలక్ట్రానిక్స్ ఇంక్., కొరియా)



శ్రీ జే సంగ్ లీ గారు
CEO. ఎకో సొల్యూషన్,
LG ఎలక్ట్రానిక్స్ ఇంక్., కొరియా

31 దేశాలకు చెందిన 235 పరిశ్రమలతో 65 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
(అందులో 50 శాతం మహిళలు) కల్పిస్తున్న శ్రీసిటీలో ప్రముఖ సంస్థ ఎల్ జి కెమ్ తో పాటు మరో
8 కొరియన్ కంపెనీలు కొలువుతీరడం గర్వకారణం

LG Electronics
LG Chem LG Polymers India Pvt. Ltd.
HDC HYUNDAI EP
SOLUM Solution provider.
HAENG SUNG
SK pucore
eorea IND. e COREA INDUSTRIAL., Ltd.
KSP

Sri City – A Global Manufacturing Hub, Where Vision Meets Reality!

న్యూస్‌రీల్

విశ్రాంత ఉద్యోగికి రూ.50 లక్షలకు టోకరా

తెనాలి రూరల్: డిజిటల్ అరెస్ట్ పేరిట విశ్రాంత ఉద్యోగి నుండి సైబర్ నేరగాళ్లు రూ. 50 లక్షలకుపైగా కాజేశారు. వివరాలిలా ఇలా ఉన్నాయి... పట్టణ బోస్‌రోడ్డులోని మధువని అపార్ట్‌మెంట్‌లో నివసించే 80 ఏళ్ల కొడాలి వెంకటసుబ్బయ్య సింగరేణి బొగ్గుగనుల అధికారిగా పని చేసి రిటైరయ్యారు. ఇటీవల ఆయనకు అపరిచిత వ్యక్తి ఫోన్ చేసి తాను పోలీసు అధికారినని పరిచయం చేసుకున్నాడు. ఓ ఆర్థిక నేరం కేసు దర్యాప్తులో నిందితుడు 150కుపైగా బ్యాంకు ఖాతాలు తెరిచాడని, అందులో వెంకటసుబ్బయ్య ఖాతా కూడా ఉందని చెప్పాడు. డిజిటల్ అరెస్ట్ చేస్తున్నామని, ఎటూ కదలనీయకుండా చేసి వృద్ధుడి నుంచి అన్ని వివరాలు సేకరించి రూ. 50 లక్షలకుపైగా నగదును బ్యాంకు ఖాతా నుంచి తమ ఖాతాలకు మళ్లించుకున్నారు. బాధితుడు వన్ టౌన్ పోలీసులను ఆశ్రయించడంతో బుధవారం రాత్రి కేసు నమోదు చేశారు.

తెనాలిలో మాక్ డ్రిల్



తెనాలి అర్బన్: భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఇండియా చేపట్టిన చర్యలకు ప్రజలందరూ మద్దతు తెలపాలని పలువురు అధికారులు కోరారు. చినరావూరులోని హెచ్‌పీ గ్యాస్ గోడౌన్ వద్ద బుధవారం సాయంత్రం వివిధ ప్రభుత్వ శాఖల అధికారుల ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. యుద్ధం జరిగితే పౌరులు ఎలా స్పందించాలనే విషయంపై అగ్నిమాపక అధికారులు శిక్షణ ఇచ్చారు. అందరూ అప్రమత్తంగా ఉండటంతో పాటు అవసరమైతే సైన్యంలో చేరేందుకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, తహసీల్దార్ గోపాలకృష్ణ, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ అన్నపూర్ణ, రూరల్ సీఐ ఉమేష్, ఎంపీడీవో అత్తోట దీప్తి, స్పెషల్ బ్రాంచ్ అధికారి రాంబాబు, ప్రభుత్వ ఐటీఐ కళాశాల విద్యార్థులు తదిరులు పాల్గొన్నారు.

రైతులకు అభివృద్ధి చేసిన ప్లాట్లు ఇవ్వాలి



లక్ష్మీపురం: రాజధాని నిర్మాణ కోసం భూములు ఇచ్చిన రైతుల ప్లాట్లను వెంటనే అభివృద్ధి చేసి వారికి అప్పగించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జొన్న శివశంకర్, కంచుమాటి అజయ్‌కుమార్‌లు డిమాండ్ చేశారు. బుధవారం బ్రాడీపేటలోని రైతు సంఘం కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఇందులో వారు మాట్లాడుతూ.. ఈ ఏడాది అన్ని పంటలకు మద్దతు ధర సగానికి పడిపోవటం రైతులను తీవ్ర సంక్షోభానికి గురిచేసిందన్నారు. పత్తి, మిర్చి పంటలను పెట్టుబడులు పెరిగిపోవడం, తెగుళ్లతో దిగుబడి రాలేదన్నారు. కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో తక్కువ ధరకే విక్రయించాల్సి వస్తోందన్నారు. మిర్చి యార్డ్‌లో కమీషన్ ఏజెంట్లు సిండికేట్ ప్రభావంతో ధరలు పూర్తిగా తగ్గాయని తెలిపారు. మద్దతు ధరల స్కీము యార్డ్‌లో వారికి మాత్రమే వర్తించేలా ఉండటంతో గ్రామీణ ప్రాంతాల్లోని వారు దళారులకు విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. ఈ క్రాప్‌లో నమోదు కాని కౌలు రైతులు కూడా ఈ స్కీం కిందకు రావడం లేదన్నారు. మినుము, పెసర, జొన్న పంటల దుస్థితి కూడా ఇంతేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేరుకే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవడం లేన్నారు. ధరల స్థిరీకరణ నిధి కింద డబ్బులు కేటాయించి మద్దతు రేటుకు కొనుగోలు చేస్తే ప్రైవేట్ వ్యాపారస్తులు ధరలు పెంచే అవకాశం ఉందన్నారు. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో రైతులు భారీగా నష్టపోయారన్నారు. రాజధానికి సంబంధించి మరిన్ని భూములు తీసుకోవాలని ప్రభుత్వం ప్రకటించిందని, గతంలో భూములు ఇచ్చిన రైతుల ప్లాట్లు వెంటనే అభివృద్ధి చేసి అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కమిటీ సభ్యుడు ఇమ్మడి రామారావు తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

అనకాపల్లి టౌన్: తెలుగు రాష్ట్రాల్లో చోరీలకు పాల్పడుతున్న దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు డీఎస్పీ శ్రావణి తెలిపారు. ఈ మేరకు స్థానిక డీఎస్పీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అనకాపల్లి మండలం, పట్టణంలో ఈ నెల 1న జరిగిన మూడు దొంగతనాలపై అందిన ఫిర్యాదు మేరకు ఎస్పీ ఆదేశాలతో ప్రత్యేక పోలీస్ టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. గ్రామీణ సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐ రవికుమార్ నేతృత్వంలో టీమ్‌లు ఆధునిక సాంకేతికత సహాయంతో దొంగలను బుధవారం మారేడిపూడి జంక్షన్‌లో అదుపులోకి తీసుకున్నారన్నారు. తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు(24), ఉప్పల సురేష్(30), కందివలస నరసింహారావు(39), జనార్దన్(30), కంకణాల సుభాష్(19) పాత కేసుల్లో జైలులో ఉన్నప్పుడు పరిచయాలు పెంచుకొని ఐదుగురు ముఠాగా ఏర్పడ్డారని తెలిపారు. వీరంతా గుంటూరు జిల్లాకు చెందిన వారని, ఆటో డ్రైవర్లుగా జీవనం సాగిస్తూ డబ్బు అవసరమైనప్పుడు దొంగతనాలకు పాల్పడుతుంటారని ఆమె వివరించారు.

భూగర్భ జలవిలాపం

కూటమి అధికారంలోకి వచ్చాక యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు

- విచ్చలవిడి ఇసుక తవ్వకాలతో అడుగంటిన భూగర్భ జలాలు
- నదీ పరివాహక ప్రాంతాల్లో ఎండిపోయిన రక్షిత నీటి పథకాలు
- పల్లెలు, పట్టణాల్లో తాగునీరు అదంక ప్రజలకు తప్పని ఇబ్బందులు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: వీరులపాడు మండలంలో కట్టలేరు ఒడ్డునే ఉన్న దొడ్డదేవరపాడు గ్రామానికి తాగునీటి కష్టాలు తప్పడం లేదు. గ్రామానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న వి.అన్నవరం వద్ద వైరా నదిలో బోరు వేసి, అక్కడి నుంచి పైపులైన్ ద్వారా దొడ్డదేవరపాడు గ్రామంలోని ట్యాంక్‌ను నీటితో నింపుతున్నారు. ఆ నీటిని గ్రామంలోని దళిత కాలనీ, బీసీ కాలనీకి వంతుల వారీగా మూడు రోజులకోసారి సరఫరా చేస్తున్నారు. అది కూడా అరకొరగానే. తరచూ పైపులైన్లు లీకవడం, విద్యుత్ సరఫరాలో అంతరాయం వల్ల ఇబ్బందులు తప్పడంలేదు. తీగునీరు అందని దళితవాడ వాసులు కట్టలేరులో చలమల నీటితోనే దాహార్తి తీర్చుకుంటున్నారు. యువకులు సైకిళ్లకు ప్లాస్టిక్ క్యాన్లు కట్టుకుని, మహిళలు బిందెలతో చెలమల వద్దకు వచ్చి తాగునీటిని తీసుకెళ్లడం ఇక్కడ నిత్య కృత్యం.



కట్టలేరు చలమల వద్దకు నీటికోసం వచ్చిన దొడ్డదేవరపాడు గ్రామస్తులు

తాగునీటి కష్టాలు ఒక్క దొడ్డదేవరపాడు గ్రామానికే పరిమితం కాలేదు. ఏటిపట్టు గ్రామాల్లో దాహం కేకలు మిన్నంటుతున్నాయి. నీరు అందక రక్షిత మంచినీటి పథకం మోటార్లు పాడైపోతున్నాయి. ఎన్టీఆర్ జిల్లాకు ఓ వైపు కృష్ణానది మూడు వైపులా మున్నేరు, వైరా, కట్టలేరు ఉపనదులు ప్రవహిస్తున్నాయి. జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో రక్షిత మంచి నీటి పథకాల మోటార్లను కృష్ణా, ఉపనదుల ఒడ్డునే ఏర్పాటు చేశారు. కూటమి అధికారం చేపట్టిన తర్వాత వాగులు, వంకలు, ఏర్లు అన్న తేడా లేకుండా విచ్చలవిడిగా ఇసుక అక్రమ తవ్వకాలు సాగుతున్నాయి. కృష్ణా నదిలో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు చేపట్టడంతో పరివాహక ప్రాంతంలోని రక్షిత మంచినీటి పథకాలకు నీరు అందడం లేదు. నదికి



నందిగామ వద్ద మునేరులో రక్షిత మంచినీటి పథకం విద్యుత్ బోర్లకు అందని తాగునీరు

నీటి ప్రవాహ పాయలు కుడివైపుగా ఉండడం, ఎడమవైపు పొక్లెయిన్లతో ఇసుక తవ్వడంతో భూగర్భ జలాలు పడిపోతున్నాయి. కంచికచర్ల మండలంలోని పరిటాల గ్రామంలో గత ఏడాది మార్చిలో 7.34 మీటర్లలో లోతున భూగర్భలాలు నమోదయ్యాయి. ఈ ఏడాది మార్చి నాటికి 8.63 మీటర్లకు పడిపోయాయి. పెండ్యాలలో 3.99 మీటర్ల నుంచి 4.5 మీటర్లకు భూగర్భ జలాలు పడిపోయాయి.

ఎక్కడ చూసినా ఇసుక తవ్వకాల జాడలే..

కంచికచర్ల మండలంలో దాదాపు అన్ని గ్రామాలకు కృష్ణానది నుంచి, నాలుగైదు గ్రామాలకు మున్నేటి నుంచి తాగునీటి సరఫరా జరుగుతోంది. ప్రస్తుతం కృష్ణానదిలో ఎక్కడ చూసినా ఇసుక తవ్విన జాడలే కనిపిస్తున్నాయి. నదిలో నీరు లేకపోవడంతో మండల ప్రజలు తాగునీరు, వాడుక నీటి అవసరాలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చందర్లపాడు మండలం కాసరబాద నది ఒడ్డునే ఉన్నప్పటికీ నీటి కష్టాలు తప్పడం లేదు. ఇక్కడ ఇసుక తవ్వకాలు అడ్డగోలుగా సాగుతున్నాయి. పొక్కునూరు గ్రామంలోనూ నీటి ఎద్దడితో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. వత్సవాయి మండలంలో మున్నేరు పరివాహక గ్రామాల్లో సైతం భూగర్భ జలాలు అడుగంటి తాగునీటి అవస్థలు తప్పడం లేదు. డ్యామ్ ఉన్న పోలంపల్లిలోనే భూగర్భ జలమట్టం తగ్గిపోయింది. ఎ.కొండూరు మండలంలో స్థానికంగా లభించే నీటిని తాగునీటికి వినియోగించే పరిస్థితి లేదు.

ఎటు చూసినా ఇసుకే..

- నందిగామ పట్టణంలో తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడింది. పట్టణానికి తాగునీరు సరఫరాచేసేందుకు మునేరులో ఆరు బోర్లు వేశారు. నాలుగు బోర్లలో నీరు పూర్తిగా అడుగంటింది. రెండు బోర్ల ద్వారా అరకొర నీరు సరఫరా అవుతోంది. దీంతో మునిసిపాలిటీలో నాలుగైదు రోజులకు ఓ సారి తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఉచిత ఇసుక పథకం పేరుతో కూటమి నేతలు జేసీబీలతో విచ్చలవిడిగా ఇసుకను తోడేయడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని స్థానికులు వాపోతున్నారు.
- చందర్లపాడు మండలం కాసరబాద కృష్ణానదిలో ఇసుక రీచ్ పేరుతో ఇరవై అడుగుల లోతు పెట్టి పెద్ద పొక్లెయిన్లతో ఇసుకను తవ్వటంతో నదిలో ఇసుక తప్ప చుక్కనీరు కనిపించటం లేదు.
- కంచికచర్ల మండలం కీసర, వేములపల్లి, పెండ్యాల, రీచ్‌లలో ఇసుకను అక్రమంగా తవ్వకాలు జరపటంతో మున్నేరులో కనీసం పశువులు తాగేందుకు చుక్కనీరు కరువైంది. నీరు అందక విద్యుత్ మోటార్లు కాలిపోతున్నాయి. ఇటీవల గండేపల్లి, కంచికచర్ల గ్రామాలకు తాగునీరు సరఫరా చేసే విద్యుత్ మోటార్లు పూర్తిగా కాలిపోయాయి.

ఇసుక తవ్వకాల వల్లే..



కూటమి నాయకులు వేములపల్లి రీచ్‌లో అక్రమంగా లోతుగా ఇసుక తవ్వకం జరపటం వల్ల ఉపనదిలో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. విద్యుత్ మోటార్లకు నీరు అందడం లేదు. నీరు అందక విద్యుత్ మోటార్లు కాలిపోతున్నాయి. ఫలితంగా గ్రామానికి సక్రమంగా తాగునీరు సరఫరా కావటం లేదు. గ్రామంలోని ఆర్వో ప్లాంట్ల వద్ద నీటిని కొనుగోలు చేసి తాగాల్సిన పరిస్థితులు దాపురించాయి. ఈ ఖర్చు భారంగా మారింది.

– సీహెచ్ కృష్ణ,
వేములపల్లి, కంచికచర్ల మండలం

చలమల నీరే దిక్కు



మా ఊరి పక్కనే కట్టలేరు ఉంది. ఇక్కడికి దూరంగా అన్నవరం గ్రామం వద్ద వైరా ఏరులో మోటార్లు ఏర్పాటు చేసి అక్కడి నుంచి నీటిని సరఫరా చేస్తున్నారు. మూడు నాలుగు రోజులకోసారి నీరు వస్తోంది. ఆర్వో ప్లాంట్ల వద్ద నీరు కొనితాగితే కాళ్లు, కీళ్ల నొప్పులు వస్తున్నాయి. దళితవాడతో పాటు బీసీ కాలనీ వాసులకు కట్టలేరు చలమల్లో నీరే దిక్కయింది. ఏట్లో చిన్న పాయ ఉంది. అది కూడా ఎండిపోతే ఇబ్బందులు తప్పవు.

– పి.నాగరాజు, దళితవాడ,
దొడ్డదేవరపాడు, వీరులపాడు మండలం

జెడ్పీ బడ్జెట్‌కు ప్రభుత్వ ఆమోదం సిగ్గుచేటు



పిల్లి ఓబుల్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు

గుంటూరు ఎడ్యుకేషన్ ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్‌కు సంబంధించిన ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను ప్రభుత్వం ద్వారా నేరుగా ఆమోదింపచేసుకోవడం సిగ్గుచేటని రొంపిచర్ల జెడ్పీటీసీ సభ్యుడు పిల్లి ఓబుల్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జెడ్పీ సర్వసభ్య సమావేశంలో చర్చించి, సభ్యులందరి సహకారంతో ఆమోదింపచేసుకోవాల్సిన ఆర్థిక సంవత్సర ప్రణాళికను సభ్యుల ప్రమేయం లేకుండా నేరుగా ప్రభుత్వానికి పంపడం ద్వారా చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా గుంటూరు జిల్లా జెడ్పీ పరువు మంట కలిపారని ఆరోపించారు. జెడ్పీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కొత్త సంస్కృతికి చైర్‌పర్సన్ తెర తీయడం సిగ్గు చేటన్నారు. పాలకమండలి లేని సమయంలోనే పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ప్రభుత్వం జెడ్పీ బడ్జెట్‌ను ఆమోదిస్తుందని, పాలకమండలి ఉండగా బడ్జెట్‌ను ఆమోదించే అధికారం ప్రభుత్వానికి ఎక్కడిదని ప్రశ్నించారు. మార్చి 15న జరిగిన సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడిందని, అయితే మార్చి 29న ఏర్పాటు చేసిన సమావేశాన్ని అర్థాంతరంగా ఎందుకు వాయిదా వేశారనే విషయం చైర్‌పర్సన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సభ్యులను సమన్వయ పరచుకోవడంలో విఫలమై, సమావేశాన్ని వాయిదా వేసుకుని, బడ్జెట్‌ను దొడ్డిదారిన ప్రభుత్వానికి పంపి ఆమోదింపచేసుకోవడం నిబంధనలకు విరుద్ధమన్నారు. వైఎస్సార్ సీపీ అభివృద్ధిని అడ్డుకుంటోందని, బడ్జెట్ ఆమోదానికి కోరం లేకుండా చేశారని తమపై నిబంధనలు మోపడం తగదన్నారు. క్విడ్ ప్రోకోకు వ్యతిరేకంగా తాము సమావేశాన్ని బహిష్కరించామని తెలిపారు. సభ ఆమోదం, అంగీకారం, రాటిఫికేషన్ తరువాత అభివృద్ధి అజెండాకు సంబంధించిన ప్రతులను పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగానికి పంపుతారని చెప్పారు. అయితే ముందస్తు అనుమతుల పేరుతో ఇష్టారాజ్యంగా అనుమతులు ఇచ్చేసి, కాంట్రాక్టర్లకు కట్టబెట్టి క్విడ్ ప్రోకో ద్వారా చేస్తున్న అక్రమాలను తాము వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. పీఆర్ చట్టంలోని సెక్షన్ 193 (6) ప్రకారం 90 రోజుల్లోపు సమావేశాన్ని నిర్వహించకుంటే, ఆ తదుపరి 30 రోజుల్లోగా సమావేశాన్ని ఏర్పాటు చేయడంలో విఫలమైన పక్షంలో చైర్‌పర్సన్ తన పదవిలో కొనసాగలేరని తెలిపారు.

త్వరితగతిన ఇన్నర్ రింగ్‌రోడ్డు ఫేజ్ 3 పూర్తి

గుంటూరు రూరల్: ఇన్నర్ రింగ్ రోడ్ ఫేజ్ 3 పెండింగ్ పనులను వేగంగా చేపట్టి అందుబాటులోకి తీసుకొస్తామని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం ఫేజ్–3 పనులను స్వర్ణభారతీనగర్ ప్రాంతంలో నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్యే బి.రామాంజనేయులు, ఏపీ ఇండస్ట్రియల్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్‌లతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేరేచర్ల నుంచి పల్నాడు వైపునకు వెళ్లడానికి ఈ ఇన్నర్ రింగ్ రోడ్డు ప్రధాన రహదారిగా ఉపయోగపడుతుందన్నారు. 10–14 ఏళ్ల క్రితం పల్నాడు నుంచి వచ్చే ట్రాఫిక్ గుంటూరు సిటీ బయట నుంచి వెళ్లేలా ప్లాన్ చేసి డిజైన్ చేసిన రహదారని చెప్పారు. ఇన్నర్ రింగ్ రోడ్ ప్రభావిత భవనాలకు స్ట్రక్చరల్ నష్ట పరిహారం చెల్లించాల్సినవి ఇంకా ఉండగా, త్వరలోనే పూర్తి నిర్మాణానికి రహదారి సిద్ధం అవుతుందన్నారు. స్థలం కోల్పోయిన ప్రతీ ఒక్కరికి నెలకు రూ.10 వేల చొప్పున పరిహారం ఇప్పటికే అందించబడిందని, త్వరలోనే టెండర్లను పిలిచి నిర్మాణాలు ప్రారంభింపజేసేలా ప్రయత్నం చేస్తామన్నారు. ఈ ఇన్నర్ రింగ్ రోడ్ కొత్తగా రాబోయే ఔటర్ రింగ్ రోడ్డుకు కూడా అనుసంధానంగా ఉంటుందన్నారు. మేయర్ మాట్లాడుతూ నగరంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను ప్రజా అవసరాల మేరకు టైం లైన్ పెట్టుకొని వేగంగా చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. కమిషనర్ మాట్లాడుతూ ఇన్నర్ రింగ్ రోడ్ ఫేజ్–3 పూర్తికి పెండింగ్‌లో ఉన్న ప్రాంతంలో ఖాళీ స్థలాలతో కలిపి 385 ఆస్తులు ప్రభావితం అవుతాయని చెప్పారు. వాటిలో 340 బీఫారాలు, ఆక్రమణలు ఉన్నాయన్నారు. ఇప్పటికే మానవతా దృక్పథంతో బీఫారాలు, ఆక్రమణదారులకు నిర్మాణ నష్ట పరిహారాన్ని తొలివిడతగా 128 మందికి ఇచ్చామని వెల్లడించారు. త్వరలో మిగిలిన వారికి కూడా ఇంజినీరింగ్ అధికారులు నష్ట పరిహార అంచనాలు పూర్తి చేశాక ఇస్తామని తెలిపారు. ఎంఎల్ఏ మాట్లాడుతూ 12 కిలోమీటర్ల ఇన్నర్ రింగ్ రోడ్‌లో కేవలం 910 మీటర్లను విస్తరణ చేయకపోవడం వలన మిగిలిన రోడ్ ఏర్పాటు చేసినప్పటికీ ఉపయోగంలోకి రాలేదున్నారు. ఇన్నర్ రింగ్ రోడ్ పూర్తి అయితే పేరేచర్ల నుంచి నగరంలోకి రాకుండా నేరుగా కాకాని రోడ్ జాతీయ రహదారికి వెళ్లడానికి వీలవుతుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బి.స్మిత పద్మజ, వై.సాంబిరెడ్డి, సిటి ప్లానర్ రాంబాబు, ఏసీపీ రెహ్మాన్, సీఆర్డీఏ ఎస్ఈ భాస్కర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



రోడ్డు పనులు పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న మంత్రి పెమ్మసాని

జీజీహెచ్‌లో అత్యాధునిక కంటి వైద్య పరికరాలు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ అభివృద్ధికి సహాయం అందిస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు అని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. బుధవారం గుంటూరు జీజీహెచ్‌లో కంటి వైద్య విభాగానికి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు తరఫున రూ. 65 లక్షల విలువైన వైద్య పరికరాలను, జింకానా చైర్మన్ ఆఫ్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీ త్రిపురనేని రవికుమార్ రూ. 20 లక్షల విలువైన వైద్య పరికరాలను జీజీహెచ్‌కు అందజేశారు. ముఖ్య అతిథిగా డాక్టర్ పెమ్మసాని వైద్య పరికరాలను ప్రారంభించారు. జీజీహెచ్‌కు దాతలు ఇచ్చే ప్రతి రూపాయి పూర్తి స్థాయిలో ఉపయోగపడుతోందని చెప్పారు. ప్రభుత్వం జీజీహెచ్ అభివృద్ధికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. జీజీహెచ్‌లో పూర్తి స్థాయిలో అన్ని వైద్య పరికరాలు సమకూర్చిన పిదప జిల్లాలోని ఇతర ఆసుపత్రులకు ఇస్తామన్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశ్వి రమణ మాట్లాడుతూ డాక్టర్ పెమ్మసాని చొరవతో జీజీహెచ్‌లో కార్పొరేట్ వైద్య సేవలు పేదలకు అందించేలా కృషి చేస్తున్నామన్నారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు ఆసుపత్రి అభివృద్ధి కోసం దాతలను తీసుకొస్తున్నారని, అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్లకోమా వ్యాధి వల్ల కంటిచూపు పోకుండా ముందస్తుగానే కట్టడి చేసేందుకు అత్యాధునిక వైద్య పరికరాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. విరాళాలు అందజేసిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు రీజినల్ హెడ్ సి.హెచ్.పవన్‌కుమార్, జింఖానాకు చెందిన డాక్టర్ త్రిపురనేని రవిలను మంత్రి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, రాష్ట్ర మాదిగ వెల్ఫేర్, కో–ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్ పర్సన్ డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి, ఎమ్మెల్యేలు మొహమ్మద్ నసీర్ అహ్మద్, బూర్ల రామాంజనేయులు, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, బీజేపీ గుంటూరు తూర్పు నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్, నగర డెప్యూటీ మేయర్ సజీలా, కార్పొరేటర్ పోతురాజు సమత, నాట్కో కో ఆర్డినేటర్ యడ్లపాటి అశోక్‌కుమార్, జింకానా కో ఆర్డినేటర్ డాక్టర్ హనుమంతరావు, డాక్టర్ బాలభాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ కేంద్రం ప్రారంభం

ఆసుపత్రిలో వైద్య పరికరాలు ప్రారంభం అనంతరం మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో జీజీహెచ్ ప్రధాన ద్వారం వద్ద టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వడ్రాణం హరిబాబు నాయుడు ఏర్పాటు చేసిన మజ్జిగ, మినరల్ వాటర్ పంపిణీ, అన్నదానం కార్యక్రమాన్ని కేంద్ర సహాయ మంత్రి ప్రారంభించారు.


ఉగ్రవాదులకు బుద్ధి చెప్పిన భారత్

అనంతరం డాక్టర్ పెమ్మసాని మీడియాతో మాట్లాడుతూ ఉగ్రవాదులకు భారత్ సైన్యం గట్టిగా బుద్ధి చెప్పిందన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందని వెల్లడించారు. ఉగ్రవాదులు ఎక్కడ ఉన్నా ఏరివేస్తామని ప్రధాని మోదీ చెప్పిన మాటలు నిజమయ్యాయన్నారు. మోదీ ఉన్నంత వరకు దేశానికి ఇబ్బందులు ఉండవన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండి గతంలో ఏం చేసిందో ప్రజలందరూ గమనించారన్నారు. పాక్ దాడిపై రాహుల్ గాంధీ మాట్లాడటం ఆయన అమాయకత్వమని, రాహుల్ గాంధీ మాటలు పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు.



గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతి డాక్టర్ కవితకు వైద్య పరికరాలు అందజేస్తున్న సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని

వ్యక్తి దారుణ హత్య



కోటేశ్వరరావు (ఫైల్)

మంగళగిరి/మంగళగిరి టౌన్: మంగళగిరి రూరల్ పరిధిలోని కాజ, పెదవడ్లపూడి మధ్య డొంకరోడ్డులో పెదవడ్లపూడికి రెండు కిలోమీటర్ల దూరంలో దారుణం చోటు చేసుకుంది. బుధవారం రాత్రి ఓ వ్యక్తి హత్యకు గురైన విషయాన్ని మంగళగిరి పోలీసులు గుర్తించారు. మంగళగిరి రూరల్ సీఐ వై.శ్రీనివాసరావు, ఎస్ఐ సిహెచ్ వెంకట్‌లు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతి చెందిన వ్యక్తి కోటేశ్వరరావు (ఈశ్వర్)(47) మంగళగిరి పట్టణంలోని ఎంఎస్ఎస్ నగర్‌కు చెందినవాడిగా గుర్తించారు. 15 సంవత్సరాల క్రితం ఎంఎస్ఎస్ నగరకు వెళ్లి భార్య ఇద్దరు పిల్లలతో నివాసముంటున్నాడు. హిజ్రాలతో అలవాటు పడ్డ కోటేశ్వరరావు రాత్రి సమయంలో వారితో తిరుగుతూ దుస్తులు మార్చుకుని వారితో స్నేహానికి అలవాటు పడ్డాడు. ప్రతి రోజు పెదవడ్లపూడి రోడ్డులో హిజ్రాలతో కలిసి వస్తున్నాడని పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ లోగా రాత్రి సమయంలో కోటేశ్వరరావు హత్యకు గురయినట్లు పోలీసులు కుటుంబసభ్యులకు సమాచారమివ్వగా కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని ఘొల్లుమన్నారు. మృతుడి ఎడమ చేతి మణికట్టు భాగాన్ని పూర్తిగా కత్తితో నరికారు. అలాగే ఎడమ చేతిపై నాలుగు కత్తి పోట్లుతో పాటు పీక దారుణంగా నరకడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. జరిగిన ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కోటేశ్వరరావు ద్విచక్రవాహనం మీద వుండగా దాడి చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతునితోపాటు మరొక వ్యక్తి సంఘటనా స్థలంలో ఉన్నట్లు గుర్తించి పోలీసులు ఆ వ్యక్తిని అదుపులో తీసుకున్నారు.

వర్డ్ చాంపియన్స్.. కనిమెర్ల కిడ్స్

ఇంగ్లిష్‌లో 'పవర్' చాటిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

అది ఓ మారుమూల గ్రామం.. అందులో ఓ ప్రాథమిక పాఠశాల.. పరిమిత సంఖ్యలో ఉండే విద్యార్థులు.. వారికి వాడుక భాష తప్ప.. తెలుగు కూడా సరిగ్గా రాని పరిస్థితి. అలాంటి వారు జాతీయ స్థాయి వేదికపై ఇంగ్లిష్‌లో అనర్గళంగా మాట్లాడటం, రాయడం అంటే ఆషామాషీ కాదు. కానీ దానిని సుసాధ్యం చేసి చూపించారు ఈ బుడతలు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పుణ్యమాని ఇంగ్లిష్ మీడియంలో చదువుతూ.. ఇప్పుడు దేశ వ్యాప్తంగా 30లక్షల మంది విద్యార్థులతో పోటీ పడి తమ పాఠశాల, గ్రామం, జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టారు. జాతీయ స్థాయిలో రాష్ట్రాన్ని చాంపియన్‌గా నిలిపి వారెవ్వా వండర్ కిడ్స్ అనిపించుకున్నారు.

జి.కొండూరు: ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం విద్య అనేది చారిత్రక తప్పిదంలా నానా యాగీ చేసిన నేటి పాలకులకు, ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు సాధిస్తున్న అద్భుత ఫలితాలు చెంప పెట్టులా మారాయి. దీనికి ప్రత్యక్ష సాక్ష్యమే ఎన్టీఆర్ జిల్లా, మైలవరం మండల పరిధి కనిమెర్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల. మారుమూల పల్లెటూరులో ఉన్న ఈ పాఠశాల ఇప్పుడు దేశంలోనే హాట్ టాపిక్‌గా మారింది. జాతీయ స్థాయి ఇంగ్లిష్ వర్డ్ పవర్ చాంపియన్ షిప్ పోటీలలో మొదటి రెండు స్థానాలను కైవసం చేసుకొని, రాష్ట్రానికి ఓవరాల్ చాంపియన్ ట్రోఫీని సాధించి.. కార్పొరేట్ పాఠశాలలకు తామేమీ తక్కువ కాదని నిరూపించారు ఇక్కడి విద్యార్థులు.

పట్టు సాధించే విధంగా..

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇంగ్లిష్ మీడియం విద్యను అమలు చేసిన నాటి నుంచి కనిమెర్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఇంగ్లిష్ విద్యా బోధన జరుగుతోంది. ఈ పాఠశాలకు మండవ విజయలక్ష్మి ఒక్కరే ఉపాధ్యాయురాలుగా, హెచ్‌ఎంగా పని చేస్తున్నారు. విద్యార్థులకు ఇంగ్లిష్‌పై పట్టు సాధించే విధంగా విజయలక్ష్మి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ప్రభుత్వం అందించిన పుస్తకాలను విద్యార్థులకు అర్థమయ్యేలా వినూత్న పద్ధతుల్లో అదనంగా ప్రతి రోజూ ముప్పై నిముషాలు ప్రత్యేక తరగతి నిర్వహించి బోధన చేశారు.

పేద కుటుంబ నేపథ్యం..

కనిమెర్ల గ్రామంలో నిరుపేద కుటుంబంలో పుట్టిన అన్నా చెల్లెళ్లు బి.రేవంత్‌కుమార్, బి. సింధు ప్రియ ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చి రాష్ట్రానికి పేరు తెచ్చారు. ఈ చిన్నారుల తండ్రి భూపతి ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తుండగా, తల్లి దయామణి వ్యవసాయ కూలీగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. నివసించడానికి పక్కా ఇల్లు కూడా లేని ఈ కుటుంబం నుంచి ఇద్దరు చిన్నారులు జాతీయస్థాయిలో ప్రతిభ చాటి రాష్ట్రానికి, జిల్లాకి, కనిమెర్ల గ్రామానికి ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టారు. వీరిద్దరికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ సైతం వీరిద్దరితో పాటు హెచ్‌ఎం విజయలక్ష్మిని సన్మానించి ప్రత్యేకంగా అభినందించారు.

'నాడు–నేడు'తో పాఠశాల అభివృద్ధి

ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ విద్యను ప్రవేశపెట్టడంతో పాటు పాఠశాలలకు మెరుగైన వసతులను అందించడమే లక్ష్యంగా గత ప్రభుత్వం చేపట్టిన 'నాడు–నేడు' కార్యక్రమం కింద కనిమెర్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ఆధునికీకరణ కోసం రూ.12లక్షల వరకు ఖర్చు పెట్టారు. ఈ నిధులతో భవనం మరమ్మతులు, ప్రహరీ నిర్మాణం, టాయిలెట్‌ల రిపేర్లు, అత్యాధునిక సామగ్రి, విద్యోపకరణాలు అందించడం వంటి పనులను చేశారు.



జాతీయ ఇంగ్లిష్ వర్డ్ పవర్ చాంపియన్ షిప్ ట్రోఫీ, జ్ఞాపికలతో హెచ్‌ఎం విజయలక్ష్మి, విద్యార్థులు రేవంత్, సింధు

సాక్షి
గుంటూరు
గురువారం । 8 । మే । 2025



కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు

తెనాలిఅర్బన్: చెంచుపేట ఆర్‌పీఎం క్లబ్ రోడ్డులో ఆక్రమణల తొలగింపు బుధవారం కొనసాగింది. మురుగు కాల్వలపై ఆక్రమణలను అధికారులు పూర్తిగా తొలగించారు.



కన్యకాపరమేశ్వరి అమ్మవారికి పూజలు

దాచేపల్లి: వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. గణపతిహోమం, శాంతిహోమం నిర్వహించి, లక్ష మల్లెల పూజలు జరిపించారు.



నేడు దేవాలయం ప్రతిష్టవేడుకలు

శావల్యాపురం: కృష్ణాపురంలో శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో బుధవారం విగ్రహాల జలాభిషేకం జరిగింది. గురువారం ప్రతిష్ట వేడుకలు జరుగుతాయని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

న్యూస్‌రీల్

రోడ్ల నిర్మాణాలు పరిశీలించిన క్వాలిటీ కంట్రోల్ బృందం



తెనాలి అర్బన్: తెనాలి పట్టణంలో ఇటీవల నిర్మించిన పలు సీసీ రోడ్ల నాణ్యతను బుధవారం గుంటూరు నుంచి వచ్చిన క్వాలిటీ కంట్రోల్ సభ్యులు పరిశీలించారు. యడ్లలింగయ్య కాలనీలో–6, అమరావతి ప్లాట్స్ స్విమ్మింగ్ పూల్ దగ్గర, పూలే కాలనీ, చెంచుపేట రత్నశ్రీ పబ్లిక్ స్కూల్ దగ్గర, గంగానమ్మపేట శివాలయం వద్ద నిర్మించిన పలు రోడ్లను పరిశీలించి, వాటికి నాణ్యత పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి మున్సిపల్ ఇంజినీర్ ఆకుల శ్రీనివాసరావు, ఏఈలు సూరిబాబు, సునీల్, జానీ బాషా పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీలలో మదిర షానూన్ సత్తా



మంగళగిరి: ఉత్తరాఖండ్ డెహ్రాడూన్‌లో ఈనెల 6న జరిగిన ఏషియన్ జూనియర్ క్లాసిక్ ఉమెన్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్ తరఫున పాల్గొన్న మదిర షానూన్ 47 కేజీల విభాగంలో సిల్వర్, మూడు బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విజయభాస్కరరావు, షేక్ సంధాని తెలిపారు. తెనాలికి చెందిన షానూన్ అక్కడే ఉన్న క్విక్ ఫిట్నెస్ ఎరినాలో అంతర్జాతీయ పవర్ లిఫ్టర్ ఘట్టమనేని సాయి రేవతి వద్ద శిక్షణ పొందినట్లు పేర్కొన్నారు. పతకాలు సాధించిన షానూన్‌ను రాష్ట్ర, జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు అభినందించినట్లు తెలియజేశారు.

తెనాలిలో సదరం క్యాంప్ పునఃప్రారంభం



తెనాలి అర్బన్: వికలాంగుల ధ్రువపత్రాలను పునఃపరిశీలన కార్యక్రమంలో భాగంగా తెనాలి జిల్లా వైద్యశాలలో బుధవారం ప్రత్యేక సదరం క్యాంప్‌ను నిర్వహించారు. ఆర్థో, ఈఎన్‌టీ, సైకియాట్రిక్ విభాగాలకు చెందిన దివ్యాంగులు పరీక్షలు చేయించుకున్నారు. గురు, శుక్ర వారాల్లో కూడా క్యాంప్ జరుగుతుందని సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి తెలిపారు.

శ్రీ లక్ష్మీనరసింహస్వామి జయంత్యుత్సవాలు ప్రారంభం



మంగళగిరి టౌన్: స్థానిక శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీనరసింహస్వామి జయంత్యుత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 12వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో రామకోటిరెడ్డి తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం భగవత్ ప్రార్థన, ఆచార్య స్తోత్ర పాఠం, విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, ఆచార్య ఋత్విగ్వరణం, రక్షా బంధనం, మృత్సంగ్రహణం, అంకురార్పణ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు



పొన్నూరు: పట్టణంలోని శ్రీ సుందరవల్లి రాజ్యలక్ష్మీ సమేత సాక్షి భావన్నారాయణ స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్వామికి పంచామృత స్నపన, తిరుమంజనోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం రామలక్ష్మణస్వామి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం హనుమద్వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

సిందూర్.. సెల్యూట్

- పాక్ ప్రేరేపిత ఉగ్రవాదంపై జిల్లా ప్రజల ఆగ్రహం
- ఆపరేషన్ సిందూర్‌పై హర్షాతిరేకాలు
- కులమతాలకు అతీతంగా సైనికులకు వెన్నుదన్ను
- పాక్‌కు గుణపాఠం చెప్పాలని నినాదాలు



గుంటూరులో విజయోత్సవాలు జరుపుతున్న బీజేపీ నేతలు

గుంటూరు మెడికల్: పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారకంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌పై బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ, జాతీయ కౌన్సిల్ సభ్యుడు జూపూడి రంగరాజు హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. గుంటూరు శంకర్ విలాస్ సెంటర్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరు తిరుపతిరావు ఆధ్వర్యంలో విజయోత్సవం నిర్వహించారు. భారత మాతాకి జై.. జై జవాన్, వందేమాతరం అంటూ నినాదాలు చేశారు. తిరుపతిరావు మాట్లాడుతూ ప్రతికారేచ్ఛతో రగిలిపోతున్న భారతీయులకు ఈ విజయం అంకితమని తెలిపారు. పాక్‌కు సరైన గుణపాఠం చెప్పారని, ఇప్పటికైనా కవ్వింపు చర్యలను మానుకోవాలని హితవు పలికారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ మన దేశ సైనిక బలగాల దృఢసంకల్పానికి ప్రతీక అని పేర్కొన్నారు. జాతీయ కౌన్సిల్ సభ్యుడు జూపూడి రంగరాజు మాట్లాడుతూ సైన్యానికి మద్దతుగా భారత ప్రజలు ఉండాలని కోరారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నేతలు పాల్గొన్నారు.

ఖబడ్దార్ పాకిస్థాన్

మంగళగిరి: పెహల్గామ్ ఉగ్ర దాడికి ప్రతీకారంగా పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని తొమ్మిది ఉగ్రవాద శిబిరాలను వీరోచితంగా ధ్వంసం చేసిన సైన్యం శక్తి, సామర్థ్యాలకు దేశం గర్విస్తోందని ఏబీవీపీ నాయకులు పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ వైమానిక దాడిని స్వాగతించారు. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో కుల, మత, ప్రాంతాలకు అతీతంగా సైన్యానికి యావత్ దేశం అండగా నిలవాలని పిలుపునిచ్చారు. భారత్ మాతాకి జై..వందేమాతరం అంటూ నినాదాలు చేస్తూ ఆపరేషన్ సిందూర్‌పై హర్షం వెలిబుచ్చారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పూర్ణిమ లక్ష్మి, కార్యకర్తలు పాల్గొన్నారు.

సైన్యానికి మద్దతుగా సంఘీభావం

గుంటూరు మెడికల్: బీజేపీ గుంటూరు తూర్పు నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ శనక్కాయల ఉమా శంకర్ ఆధ్వర్యంలో ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా ఆ పార్టీ నేతలు బుధవారం జాతీయ జెండాలతో సంఘీభావం తెలిపారు. స్థానిక నాజ్ సెంటర్‌లోని వాజపేయి విగ్రహం వద్ద భారత దేశ సైన్యానికి మద్దతుగా సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా డాక్టర్ శనక్కాయల ఉమా శంకర్ మాట్లాడుతూ చర్యకి ప్రతి చర్య ఉంటుందని ప్రధాని మోదీ ముందే తెలిపారని, దానికి అనుగుణంగా ఉగ్ర స్థావరాలను మట్టుపెట్టడానికి ఆపరేషన్ సిందూర్ చేపట్టారని వివరించారు. ఆపరేషన్‌లో పాల్గొన్న సైన్యానికి ధన్యవాదాలు తెలిపారు. గుంటూరులోని జిన్నా టవర్ సెంటర్ పేరును మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం పేరు పెట్టాలని కోరారు. భారతదేశంలో పాకిస్థాన్ పేర్లతో ఉన్న అన్నింటికీ భారతీయుల పేర్లు పెట్టాలని ప్రధానమంత్రిని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతి రావు, మండల అధ్యక్షుడు మలిశెట్టి పవన్ కుమార్, మైనారిటీ మోర్చా నాయకులు ఖుద్దూస్, రఫీ, సురేష్ కుమార్ జైన్, బజరంగ్ రామకృష్ణ, నాగేశ్వరావు, మండల నాయకులు పాల్గొన్నారు.



మంగళగిరిలో హర్షం వ్యక్తం చేస్తున్న చిన్నారులు, ఏబీవీపీ కార్యకర్తలు



గుంటూరు నాజ్ సెంటర్‌లో సంఘీభావం తెలుపుతున్న బీజేపీ నేతలు

ఆపరేషన్ సిందూర్‌పై సంబరాలు

మంగళగిరి టౌన్: ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో మంగళగిరిలోని బీజేపీ కార్యాలయం వద్ద బుధవారం నాయకులు విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున టపాసులు కాల్చారు. భారతమాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ పంచుమర్తి ప్రసాద్, మండల అధ్యక్షుడు మునగాల నాగేశ్వరరావు, తాడేపల్లి అధ్యక్షుడు ఈశ్వర్ నాయుడు, సీనియర్ నాయకులు మునగపాటి వెంకటేశ్వరరావు, అందె శివశంకర రావు, మునగపాటి రమేష్, అవ్వారు నాగేశ్వర రావు పాల్గొన్నారు.



మంగళగిరిలో సంబరాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు

పౌర రక్షణ.. సమర శిక్షణ

- జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్
- గుంటూరు రైల్వే స్టేషన్‌లో పోలీసుల మాక్ డ్రిల్

లక్ష్మీపురం: అత్యవసర పరిస్థితులు, యుద్ధ సమయాల్లో పౌరులు పాటించాల్సిన స్వీయ రక్షణ జాగ్రత్త చర్యలపై అవగాహన కల్పించడానికి పోలీసులు గుంటూరు రైల్వేస్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫారంపై బుధవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. దానికి పోలీసులు గుంటూరు రైల్వే స్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫారంపై బుధవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమాన్ని జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ ఎ.రమణమూర్తి, అదనపు ఎస్పీ (ఏఆర్) ఏ. హనుమంతు పర్యవేక్షించారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ యుద్ధ సమయాల్లో అప్రమత్తతతో అనర్థాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలకు సూచించారు. విపత్కర సమయాల్లో అత్యవసర సేవలకు సంబంధించి ఆయా శాఖల సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటారనే సందేశాన్ని కూడా ఈ పౌర రక్షణ మాక్ డ్రిల్ ద్వారా ఇచ్చినట్లు తెలిపారు. అదనపు ఎస్పీ రమణమూర్తి మాట్లాడుతూ ప్రమాద హెచ్చరిక సైరన్ బట్టి ప్రత్యేక బలగాలు, సిబ్బంది సామాన్య పౌరుల మాదిరి స్వీయ రక్షణ కోసం అకస్మాత్తుగా కింద పడుకోవాలని సూచించారు. పెద్ద శబ్దాలను తట్టుకోవడానికి రెండు చేతులతో చెవులను మూసుకునీ, అటుఇటు కదలకుండా బోర్లా పడుకోవాలని సూచించారు. ఘటనలో గాయపడిన వారికి చికిత్స అందించడం కోసం అత్యవసర వైద్య సేవల సిబ్బంది అంబులెన్స్‌లోకి తీసుకువెళ్లడం గురించి వివరించారు. బాంబు నిర్వీర్య బృందం రంగంలోకి దిగి ఘటన జరిగిన పరిసర ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు, దొరికిన పేలుడు పదార్థాలను నిర్వీర్యం చేయడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెస్ట్ డీఎస్పీ అరవింద్, రైల్వే డీఎస్పీ అక్కేశ్వరరావు, ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ , పోలీస్ బలగాల సిబ్బంది, పౌరులు ల్గొన్నారు.



సహాయక చర్యల గురించి అవగాహన కల్పిస్తున్న పోలీసులు



గుంటూరు రైల్వేస్టేషన్‌లో మాక్ డ్రిల్ నిర్వహించి అవగాహన కల్పిస్తున్న జిల్లా అదనపు ఎస్పీ ఎ.రమణమూర్తి, పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ వెస్ట్ డీఎస్పీ అరవింద్, సిబ్బంది

ఎంసీటీపీ శిక్షణకు జిల్లా కలెక్టర్


గుంటూరు వెస్ట్: ముస్సోరిలో ఈ నెల 12 నుంచి వచ్చే నెల 6 వరకు జరగనున్న 3వ దశ మిడ్ కెరీర్ ట్రెనింగ్ ప్రోగ్రాం(ఎంసీటీపీ)కు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని ఎంపిక చేస్తూ సాధారణ పరిపాలన విభాగం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. కలెక్టర్ గురువారం రిలీవ్ కానున్నారు. అయితే, ఇన్‌చార్జ్‌గా ఇప్పటి వరకు ఎవ్వరికీ బాధ్యతలు ఇవ్వలేదు. నాగలక్ష్మితో పాటు స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ ఎం.హరినారాయణ, ఏపీ టూరిజం ఎండీ కె.ఆమ్రపాలి, డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ సీఈఓ పి.రవి సుభాష్‌ను ఎంపిక చేసింది.

ప్రజలపై నీటి భారం మోపే కుట్ర!

- మేయర్ అధ్యక్షతన నగరపాలక సంస్థ సాధారణ కౌన్సిల్ సమావేశం
- ప్రతి ఇంటికి నీటి మీటర్ ఏర్పాటు చేయాలి
- కమిషనర్‌ను చూసి ప్రజలు నవ్వుతున్నారు
- గుంటూరు నగర పశ్చిమ ఎమ్మెల్యే మాధవి వ్యాఖ్య
- నీటి మీటర్లను వ్యతిరేకించిన తూర్పు ఎమ్మెల్యే నసీర్



హాజరైన టీడీపీ, వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు



మేయర్ రవీంద్ర

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): కూటమి ప్రభుత్వం హామీలు నెరవేర్చకపోగా ప్రజల నడ్డి విరిచేందుకు అన్ని దారులు వెతుకుతోంది. నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అధ్యక్షతన బుధవారం నగరపాలక సంస్థ సాధారణ కౌన్సిల్ సమావేశం జరిగింది. ప్రతి ఇంటికీ నీటి మీటర్లు పెట్టి డబ్బులు వసూలు చేయాలని పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి ప్రతిపాదన తీసుకువచ్చారు. దీనికి ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మద్దతు పలికారు. అయితే, తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ వ్యతిరేకించారు. తూర్పులో ఎక్కువ శాతం పేదలు నివసిస్తుంటారని, వారిపై భారం వేయవద్దని కోరారు. అవసరమైతే పశ్చిమ నియోజకవర్గంలో నీటి మీటర్లు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.

జ్యోతిర్మయి అపార్ట్‌మెంట్ అంశాన్ని సైడ్ చేసేందుకేనా?

నగరంలో జ్యోతిర్మయి అపార్ట్‌మెంట్‌కు అనధికారికంగా నగరపాలక సంస్థ అధికారులు ఎనిమిది అంగుళాల వాటర్ పైపులైన్ కనెక్షన్ ఇచ్చారని, దీని వల్ల ఏడు వార్డులకు తాగునీరు సక్రమంగా అందడం లేదని కార్పొరేటర్ అచ్చాల వెంకటరెడ్డి సభ దృష్టికి తెచ్చారు. దీనిపై కమిషనర్ మాట్లాడుతూ సదరు అపార్ట్‌మెంట్‌కు తొలుత అనధికారికంగా కనెక్షన్ ఇచ్చారని, ఆ తరువాత అన్ని ఫీజులు కట్టించుకుని అధికారికం చేశామని తెలిపారు. ఈ సందర్భంలోనే ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ నగరంలో నీటి వృథా ఎక్కువ ఉందని, మీటర్లు పెడితే తగ్గించవచ్చని సూచించారు. దీనికి జ్యోతిర్మయి అపార్ట్‌మెంట్ అంశం నుంచి అందరి దృష్టి మర్చలేందుకు నీటి మీటర్ల ఏర్పాటును లేవనెత్తారని పలువురు కార్పొరేటర్లు అభ్యంతరం చెప్పారు.

కమిషనర్‌ను చూసి ప్రజలు నవ్వుతున్నారు

నగర కమిషనర్ రోడ్ల వెంబడి తిరుగుతున్నప్పటికీ ఆశించిన స్థాయిలో సమస్యలకు పరిష్కారం దొరక్కపోవడంతో ప్రజలు నవ్వుతున్నారని పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి తెలిపారు. వీధి కుక్క దాడిలో ఓ చిన్నారి చనిపోయిన కొద్దిరోజుల తరువాత, పిచ్చి కుక్క ఒకేసారి 20 మందిపై దాడి చేసిందని తెలిపారు. వీధి కుక్కల నియంత్రణకు తీసుకుంటున్న చర్యల వల్ల ఉపయోగం లేదన్నారు. వీధి కుక్కల నియంత్రణకు గత రెండు సార్లు కౌన్సిల్‌లో మాట్లాడానని, అసెంబ్లీలో కూడా ప్రస్తావించినా అధికారుల నుంచి ఆశించిన స్థాయిలో సమాధానం రాలేదని ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు స్పందించకపోవడం లేదు కాబట్టే, ఒకే ప్రశ్న సభ్యులు రెండు, మూడు సార్లు పెట్టాల్సిన పరిస్థితి వస్తోందని తెలిపారు. ఈసారి ఇదే విధంగా జరిగితే సంబంధిత అధికారిపై సస్పెన్షన్ లేదా శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని మాధవి కోరారు.

కేసులు ఎక్కువగా పరిష్కరించేందుకు సహకరించాలి

గుంటూరు లీగల్: జులైలో జరగబోవు లోక్ అదాలత్‌లో కేసులు ఎక్కువగా పరిష్కరించేందుకు సహకరించాలని జిల్లా జడ్జి బి. సాయి కల్యాణ్ చక్రవర్తి తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో ఫైనాన్షియల్ ఇనిస్టిట్యూషన్స్ స్టేక్ హోల్డర్స్ , కంపెనీ న్యాయవాదులతో బుధవారం సమావేశం నిర్వహించారు. వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. కేసుల సత్వర పరిష్కారానికి తీసుకోవలసిన చర్యల గురించి జిల్లా జడ్జి వివరించారు. నాలుగో అదనపు జిల్లా జడ్జి ఆర్. శరత్‌బాబు, మూడవ అదనపు జిల్లా జడ్జి సీహెచ్. వెంకట నాగ శ్రీనివాసరావు, రెండవ అదనపు జిల్లా జడ్జి వై.నాగరాజా, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియావుద్దీన్, బార్ ప్రెసిడెంట్ వై. సూర్యనారాయణలు ఫైనాన్సియల్ ఇనిస్టిట్యూషన్ ప్రతినిధులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. సమావేశంలో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్, శ్రీరామ్ ట్రాన్స్‌పోర్టు, మార్గదర్శి చిట్ ఫండ్, కపిల్ చిట్ ఫండ్, చలపతి ఫైనాన్స్, కంపెనీ కౌన్సెల్స్ పాల్గొన్నారు .



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తులు

సరస్వతీ నిలయం.. శిథిలం

- మౌలిక వసతులు కరువు
- మూలన పడిన ఇంటర్నెట్ విభాగం
- పాఠకులకు అవస్థలు

అధ్వానస్థితిలో గుంటూరు ప్రాంతీయ గ్రంథాలయం

గుంటూరు ఎడ్యుకేషన్: నగరం నడిబొడ్డునున్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయం శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితుల్లో ఉంది. శ్లాబ్ బీటలు వారి, పెచ్చులు ఊడి కింద పడుతున్నాయి.1958లో స్థాపించిన గ్రంథాలయం దశాబ్దాల తరబడి పాఠకులకు విజ్ఞానాన్ని అందిస్తోంది. దశాబ్దాల కిందటి వార్తా పత్రికలను ఇక్కడ భద్రపరుస్తున్నారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగులు ప్రతి రోజూ పెద్ద సంఖ్యలో ఇక్కడి కాంపిటేటివ్ విభాగంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు సమయాన్ని గడుపుతున్నారు.

కొత్త పుస్తకాల జాడే లేదు

పోటీ పరీక్షల విభాగంలో గత పదేళ్లుగా పుస్తకాల కొనుగోలు జాడ లేకుండా పోయింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో పోటీ పరీక్షల శిక్షణార్థులకు అవసరమైన మేరకు పుస్తకాలు పంపిణీ చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పుస్తకాలను పంపిణీ చేసిన దాఖలాలు లేవు. డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడంతో ప్రతి రోజూ 100 మందికి పైగా అభ్యర్థులు గ్రంథాలయంలోని పుస్తకాల పైనే ఆధారపడుతున్నారు. అవసరమైన సంఖ్యలో పుస్తకాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు

రూ. 8 కోట్లతో నాలుగు అంతస్తుల నూతన గ్రంథాలయాన్ని నిర్మించేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఆర్నెళ్ల కిందట ప్రభుత్వానికి పంపారు. ఇంత వరకు స్పందించక పోవడంతో పాఠకులు శిథిల భవనంలో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.



గ్రంథాలయం హాలులో కూలుతున్న పైకప్పు

మౌలిక వసతులు కరువు

మహిళలకు మినహా, పురుషులకు టాయిలెట్ల సదుపాయం లేకపోవడంతో అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దాతలు ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ మిషన్ అలంకారంగా మారింది. రన్నింగ్ వాటర్ సదుపాయం లేకపోవడంతో మున్సిపల్ వాటర్‌ను డ్రమ్ములో నిల్వచేసి, వాటర్ మిషన్‌లో పోస్తున్నారు. కాంపిటేటివ్ విభాగంలో ఏర్పాటు చేసిన ఇంటర్నెట్ విభాగం మూతపడింది. ఇంటర్నెట్ బిల్లులు చెల్లించక పోవడంతో మూసేశారు. ఫలితంగా ఇంటర్నెట్ విభాగంలోని 10 కంప్యూటర్లు మూలనపడ్డాయి.

ప్రతిపాదనలు పంపాం

కొత్త భవనానికి ప్రతిపాదనలు పంపాం. దాతల సహకారంతో పుస్తకాల కొరత లేకుండా చూస్తున్నాం. నగరపాలకసంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంప్యూటర్లు పని చేయడం లేదు.

–ఎస్. వెంకటేశ్వరరావు, గ్రంథాలయాధికారి

ఇంటర్నెట్ లేకపోవడంతో ఇబ్బంది



గ్రూప్స్‌తో పాటు వివిధ ప్రభుత్వ ఉద్యోగాల కోసం నిర్వహించే పరీక్షలకు సన్నద్ధమవుతున్నా. అయితే, ఇంటర్నెట్ విభాగం పనిచేయక పోవడంతో ఆన్‌లైన్‌లో సమాచారం పొందడం ఇబ్బందిగా ఉంది. – జి. లక్ష్మణరావు

టాయిలెట్లు లేక అవస్థలు



స్కూల్ అసిస్టెంట్ విభాగంలో బయాలజీకి ప్రిపేరవుతున్నా. టాయిలెట్ల సదుపాయం లేకపోవడంతో చాలా ఇబ్బందిగా ఉంది. రిఫరెన్స్ విభాగంలో శ్లాబు కింద పడుతుందేమోనని భయంగా ఉంది.

– బి. అశోక్

శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన

- త్వరగా నిర్మాణ పనులు పూర్తి
- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

నెహ్రూనగర్: అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలందరి సహకారంతో సాధ్యమైనంత త్వరగా శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. బుధవారం శంకర్ విలాస్ పునఃనిర్మాణ పనులకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కందుల దుర్గేష్, కలెక్టర్ నాగలక్ష్మి, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, మేయర్ కోవెలమూడి రవీంద్ర, ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, గల్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, తెనాలి శ్రావణ్‌కుమార్, నక్కా ఆనంద్‌బాబు, కన్నా లక్ష్మీనారాయణ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌లతో కలిసి పెమ్మసాని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణ విషయంలో కొన్ని అపోహలు ఉన్నాయని..వాటిన్నింటిని తీరుస్తామని చెప్పారు. బ్రిడ్జి నిర్మాణంతో కొంత మేర ప్రజలు ఇబ్బందులు పడే అవకాశం ఉన్నప్పటికీ సహకరించాలని ఆయన కోరారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ శంకర్‌విలాస్ బ్రిడ్జి నిర్మాణంలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయని చెప్పారు. ముఖ్యంగా జీవనోపాధి దెబ్బతినే వారికి పునరావాసం కల్పించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, అధికారులపై ఉందని తెలిపారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణం వేగవంతంగా చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలిపారు. కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన పూర్తి సహాయ సహకారాల్ని నగరపాలక సంస్థ తరఫున అందిస్తామని హామీ ఇచ్చారు.

బీజేపీ నేతల అసంతృప్తి

శంకర్ విలాస్ బ్రిడ్జి శంకుస్థాపనలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరావుకు ప్రాధాన్యత కల్పించకపోవడంపై ఆ పార్టీ నేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. శిలాఫలకం వద్దకు బీజేపీ జిల్లా అధ్యక్షుడిని ఆహ్వానించకుండానే శంకుస్థాపన చేయడంపై మండిపడ్డారు.



శంకుస్థాపన శిలాఫలకం వద్ద కేంద్ర మంత్రి చంద్రశేఖర్, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దుర్గేష్

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో బుధవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **3,000** గరిష్ఠం : రూ. **5,000**

మోడల్ ధర రూ. **4,000**

మిర్చి యార్డు సమాచారం

(బుధవారం ధరలు)



వచ్చిన బస్తాలు	93,868
అమ్మకాలు (గత నిల్వలతో కలిపి)	98,525
నిల్వ	32,808

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	రూ. 9,500 – 13,300
నంబరు-5	రూ. 10,000 – 12,500
273	రూ. 10,000 – 12,500
341	రూ. 10,000 – 13,200
4884	రూ. 10,000 – 11,200
సూపర్-10	రూ. 10,000 – 12,500
తాలుకాయలు	రూ. 4,500 – 6,500

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	రూ. 10,000 – 14,000
షార్క్-1	రూ. 10,000 – 12,000
బాడిగ – 355	రూ. 10,000 – 13,000
దేవనూరు డీలక్స్	రూ. 10,000 – 12,500
ఆర్మూర్	రూ. 9,800 – 11,200
తాలు	రూ. 4,500 – 6,500

-కొరిటిపాడు (గుంటూరు)

‘అల్లూరి’ సాహసం ఆదర్శనీయం

జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్



నివాళులర్పిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: బ్రిటిష్ వారిపై ప్రథమంగా పోరాడి, దేశ స్వాతంత్ర్య పోరాటానికి అల్లూరి సీతారామరాజు మార్గదర్శకునిగా నిలిచారని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. బుధవారం అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతి సందర్భంగా నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ గిరిజన ప్రజలపై బ్రిటిష్ వారు చేస్తున్న దురాగతాలకు ఎదురొడ్డి పోరాడిన ధీశాలి అని అన్నారు. స్వాతంత్ర్య సమరానికి ఆద్యుడని చెప్పారు. స్వాతంత్ర్యం కోసం సాయుధ పోరాటమే సరైన మార్గమని సీతారామరాజు భావించారని తెలిపారు. జిల్లా ఏఎస్పీలు జీవీ.రమణమూర్తి (పరిపాలన), హనుమంతు (ఏఆర్), డీఎస్పీ ఏడుకొండలురెడ్డి, సీఐలు అలహరి శ్రీనివాసరావు, ఆనంద్, ఆర్ఐలు శ్రీహరిరెడ్డి, సురేష్ నివాళులర్పించారు.

బ్రిటిషు సామ్రాజ్యాన్ని గడగడ లాడించిన మహనీయుడు అల్లూరి

గుంటూరు ఎడ్యుకేషన్: బ్రిటిషు సామ్రాజ్యాన్ని గడగడ లాడించిన మహనీయుడు అల్లూరి సీతారామరాజు అని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా పేర్కొన్నారు. బుధవారం జెడ్పీ సమావేశ మందిరంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెనీ క్రిస్టినా మాట్లాడుతూ సాయుధ పోరాటం ద్వారా బ్రిటిషు పాలకులను తరిమికొట్టడంలో అల్లూరి వీరోచిత పాత్ర పోషించారని తెలిపారు. అకౌంట్స్ అధికారి పి. శామ్యూల్‌పాల్ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో అల్లూరి వీరోచితంగా వ్యవహరించారని పేర్కొన్నారు. బ్రిటిషు పాలకులకు వ్యతిరేకంగా పోరాటంలో గిరిజనులను సమాయత్తం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కూచిపూడి మోహన్‌రావు, ఏవో రత్నంబాబు, ఉద్యోగులు తోట ఉషాదేవి, నిర్మల భారతి పాల్గొన్నారు.



అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హెనీ క్రిస్టినా, ఉద్యోగులు

మన్యం వీరుడికి ఘన నివాళి

గుంటూరు రూరల్: స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఘనంగా నివాళులు అర్పించారు. నగర శివారుల్లోని లాంఫాం నందున్న విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో వీసీ డాక్టర్ ఆర్ శారద జయలక్ష్మీదేవి అల్లూరి చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి. రామచంద్రరావు, అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది అల్లూరి చేసిన పోరాటాలు, నాయకత్వ లక్షణాలను కొనియాడారు.



అల్లూరి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న వీసీ శారద జయలక్ష్మీదేవి

వైఎస్సార్ సీపీ మీడియా విభాగం రాష్ట్ర కార్యదర్శుల నియమాకం

పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు జిల్లాకు చెందిన ఇద్దరిని పార్టీ మీడియా విభాగం రాష్ట్ర కార్యదర్శులుగా నియమితులయ్యారు.

ఈ మేరకు బుధవారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. గుంటూరు తూర్పు నియోజకవర్గానికి చెందిన వజ్రాల జయరామిరెడ్డిని, మంగళగిరి నియోజకవర్గానికి చెందిన దొంతిరెడ్డి అమర్‌రెడ్డిని మీడియా విభాగం రాష్ట్ర కార్యదర్శులుగా నియమిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి.



వజ్రాల జయరామిరెడ్డి



దొంతిరెడ్డి అమర్‌రెడ్డి

బైక్‌ల చోరీ కేసులో ఇద్దరు అరెస్టు

పట్నంబజారు: బైక్‌ల చోరీల కేసులో పోలీసులు ఇద్దరిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. లాలాపేట పోలీసు స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఈస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్, లాలాపేట పీఎస్ ఎస్‌హెచ్‌ఓ శివ ప్రసాద్ వివరాలు వెల్లడించారు. గుంటూరు నగరం ఇజ్రాయిల్‌పేటకు చెందిన షేక్ సుభాని (ప్రస్తుతం చిలకలూరిపేటలో నివాసం), విజయవాడకు చెందిన పఠాన్ ఆవేజ్‌ఖాన్‌లు కలిసి చోరీలకు పాల్పడుతున్నారు. ద్విచక్ర వాహనాల చోరీలు ఇటీవల అధికం కావడంతో పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. కింగ్ హోటల్ సమీపంలోని దుకాణం వద్ద ద్విచక్ర వాహనాన్ని ఈనెల 7వ తేదీ మధ్యాహ్నం విక్రయిస్తున్న సుభాని, ఆవేజ్ ఖాన్‌లను ఎస్‌ఐ విజయ్‌కుమార్ అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా, ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్నట్లు అంగీకరించారు. ఇద్దరూ గత ఏడాది నుంచి మారు తాళాలు తయారు చేసి చోరీలకు పాల్పడుతున్నట్లు గుర్తించామన్నారు. చోరీ చేసిన వాహనాలను ఆటోనగర్ ప్రాంతంలోని ఓ మెగా హాస్పిటల్ వెనుక భాగంలో దాచి ఓఎల్‌ఎక్స్‌లో విక్రయాలు జరుపుతున్నట్లు వెల్లడైందన్నారు. పక్కా సమాచారం మేరకు నిందితులను అదుపులోకి తీసుకుని రూ. 8.50 లక్షల విలువ చేసే 16 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై 16 కేసులు నమోదై ఉన్నట్లు తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన కానిస్టేబుళ్లు కిరణ్, శంకర్‌లను అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ అబ్దుల్ అజీజ్

క్లుప్తంగా

పసుపు ధరలు

దుగ్గిరాల: స్థానిక పసుపు యార్డుకు బుధవారం 952 బస్తాలు వచ్చాయి. మొత్తం అమ్మకం చేసినట్లు వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి ఎన్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొమ్ములు 650, బస్తాలు వచ్చాయి. వాటి కనిష్ట ధర రూ.10,000, గరిష్ట ధర రూ.11,191, మోడల్ ధర రూ.10,611 పలికింది. కాయలు 302 బస్తాలు వచ్చాయి. వాటి కనిష్ట ధర రూ.10,000, గరిష్ట ధర రూ.11,191, మోడల్ ధర రూ.10,611 లభించింది. మొత్తం 714.00 క్వింటాళ్ల అమ్మకాలు జరిగినట్లు శ్రీనివాసరావు తెలిపారు.

గుంటూరు డివిజన్ మీదుగా ప్రత్యేక రైలు

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ మీదుగా చర్లపల్లి-బెరహంపూర్‌కు ప్రత్యేక రైలును ప్రయాణికుల సౌకర్యార్థం కేటాయించినట్లు సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చర్లపల్లి-బెరహంపూర్ రైలు (07027) ప్రతి శుక్రవారం వయా గుంటూరు డివిజన్ మీదుగా ఈనెల 9,16,23,20 తేదీలు, జూన్ 6,13,20,27వ తేదీల్లో నడుస్తుందని పేర్కొన్నారు. బెరహంపూర్-చర్లపల్లి రైలు (07028) ఈ నెల 10,17,24,31 తేదీలు, జూన్ 7,14,21,28 తేదీల్లో నడుస్తుందని తెలియజేశారు. ప్రయాణికులు గమనించాలని ఆయన సూచించారు.



కల్లాల్లో మిరప కాయలపై పట్టాలు కప్పిన రైతులు

అకాల వర్షంతో రైతులకు అవస్థలు

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం సాయంత్రం ఒక్కసారిగా పెద్ద ఎత్తున ఈదురుగాలులు, వడగళ్లతో 45 నిమిషాల సేపు వర్షం పడింది. దీంతో రైతులు అవస్థలు పడ్డారు. మండలంలో పలుచోట్ల కల్లాల్లోనే మిరప కాయలు ఉన్నాయి. ఈ సమయంలో ఒక్కసారిగా మబ్బులు పట్టడంతో రైతులు పట్టాలు కప్పుకుని కాపాడుకున్నారు. అసలే దిగుబడి తక్కువగా ఉండటం, సరైన గిట్టుబాటు ధరలేకపోవడంతో ఇబ్బందులు పడుతున్న రైతులు అకాల వర్షాలతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడిపై టీడీపీ నేతల దాడి



వెల్దుర్తి: మండలంలోని బోదిలవీడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు అత్తులూరి హనుమంతరావుపై అదే గ్రామానికి చెందిన కంకనంపాటి పాపయ్య, మండలపు రాజేష్‌లు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. హనుమంతరావు పొలానికి వెళ్లి తిరిగి వచ్చిన సందర్భంలో బస్టాండ్ సెంటర్‌లో టీడీపీ కార్యకర్తలు ఆయనపై రాళ్లు, కర్రలతో దాడి చేయటంతో గాయాలపాలయ్యాడు. బంధువులు హనుమంతరావును మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం నర్సరావుపేట వైద్యశాలకు తరలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పిచ్చికుక్క దాడిలో ముగ్గురికి గాయాలు

నూజెండ్ల: పిచ్చికుక్క దాడిలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డ సంఘటన మంగళవారం అర్ధరాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని కమ్మవారిపాలెం యానాది కాలనీలో ఆరుబయట నిద్రిస్తున్న వారిపై రాత్రి 12 గంటల సమయంలో ఓ పిచ్చికుక్క దాడి చేసింది. కాలనీకి చెందిన మల్లవరపు వెంకటేశ్వర్లు, మల్లవరపు అంకమ్మ, చలంచర్ల అప్పారావులను కరిచింది. 108 వాహనంలో బాధితులను నూజెండ్ల ప్రాథమిక వైద్యశాలకు తరలించారు. యాంటీరేబిస్ ఇంజక్షన్ ఇవ్వాల్సిన వైద్యుడు అందుబాటులో లేకపోవటంతో అక్కడి వైద్య సిబ్బంది ప్రాథమిక చికిత్స చేసి వినుకొండ వైద్యశాలకు తరలించారు.

ముడిఖనిజం అక్రమ రవాణాపై ఫిర్యాదు

తనిఖీలు నిర్వహించిన అటవీశాఖ అధికారులు

బొల్లాపల్లి: బండ్లమోటు మైనింగ్ నుంచి లెడ్, డోలమైట్ ముడి ఖనిజాలు అక్రమంగా తరలించి సమీపంలోని మాలపాడు పొలంలో అక్రమంగా నిల్వ ఉంచారని స్థానికంగా వచ్చిన ఫిర్యాదు మేరకు అటవీశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఆ శాఖ వినుకొండ రేంజ్ అధికారి సి.మాధవరావు ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవారం రాత్రి 7 గంటల నుంచి 12 గంటల వరకు తనిఖీ చేపట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి.. బండ్లమోటుకు చెందిన హిందుస్తాన్ లెడ్ జింక్ మైనింగ్ నుంచి ముడిఖనిజాలు ద్విచక్రవాహనంపై తరలించి సమీపంలోని మాలపాడు గ్రామానికి చెందిన ఒక రైతు పొలంలో అక్రమంగా నిల్వ ఉంచారని స్థానికులు కొందరు ఫిర్యాదు చేశారు. 2002 అక్టోబరులో బండ్లమోటు మైనింగ్ మూతపడింది. అప్పట్లో వేల టన్నుల లెడ్, డోలమైట్, ముడి ఖనిజాల నిల్వలు బయట వదిలేశారు. ఇటీవల కాలంలో కొందరు ద్విచక్రవాహనాలపై అక్రమ మార్గంలో వీటిని తరలించి సమీపంలోని పొలంలో నిల్వ ఉంచారని స్థానికులు కొందరు మొబైల్ కెమెరాలో ఆ దృశ్యాలు తీసి జిల్లా ఫారెస్ట్ అధికారి, వినుకొండ రేంజ్ అధికారికి వాటిని పంపారు. ఈ మేరకు వినుకొండ రేంజ్ అధికారి గ్రామానికి చేరుకొని తనిఖీలు నిర్వహించారు. ఈ విషయంపై వినుకొండ రేంజ్ అధికారిని వివరణ అడగ్గా స్థానికులు ఫొటోలు తీసి పంపారని, వారి ఫిర్యాదు మేరకు తనిఖీ నిర్వహించామన్నారు. తనిఖీలో ఆ ప్రదేశంలో ఎటువంటి ముడి ఖనిజ నిల్వలు వెలుగు చూడలేదని రేంజ్ అధికారి తెలిపారు. పూర్తిస్థాయి విచారణ చేపట్టామని ఒకటి రెండు రోజుల్లో దీనిపై పూర్తి వివరాలు వెల్లడిస్తామని రేంజ్ అధికారి తెలిపారు. అయితే, ఫారెస్ట్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ప్రయోజనం లేదని, తూతూమంత్రంగా, నామమాత్రంగా తనిఖీలు నిర్వహించి చేతులెత్తేశారని స్థానికులు చెబుతున్నారు.



మాలపాడు గ్రామసమీపంలో అక్రమంగా నిల్వ ఉంచిన ముడి ఖనిజం

అసంఘటిత రంగ కార్మికులకు ఉచిత న్యాయ సహాయం

యడ్లపాడు: అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులు ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.నరేందర్ రెడ్డి తెలిపారు. అంతర్జాతీయ కార్మిక వారోత్సవాలను పురస్కరించుకొని, మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఎన్ఎస్ఎల్ నూలుమిల్లులో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సులో కార్మికులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్మిక చట్టాలు, కనీస వేతనాల హక్కులు, బాల కార్మికుల నిషేధ చట్టం తదితర అంశాలపై పూర్తి సమాచారం అందజేశారు. న్యాయ సహాయం అవసరమైన సందర్భాల్లో ఆత్మవిశ్వాసంతో ముందుకు రావాలని కార్మికులను ప్రోత్సహించారు. చిలకలూరిపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జీవీహెచ్ఎస్ ప్రసాద్, న్యాయవాదులు పి.వెంకటేశ్వరరావు, బి.రాజేష్, పారాలీగల్ వలంటీర్ జాషువా, ఏఎస్ఐ వెంగయ్య, నూలుమిల్లు జీఎం నరసింహం తదితరులు పాల్గొన్నారు.

అది ఆత్మహత్య కాదు..!

- నా కుమారుడి మృతిపై సమగ్ర దర్యాప్తు జరపండి
- క్వారీ కుంటలో పడి మృతి చెందిన తేజ్ తండ్రి పోలీసులకు ఫిర్యాదు
- కేసు నమోదు చేసుకున్న యడ్లపాడు పోలీసులు



యడ్లపాడు: మండలంలోని కొండవీడు రెవెన్యూ పరిధిలో మంగళవారం చోటుచేసుకున్న ప్రేమజంట ఆత్మహత్యాయత్నం ఘటనపై బుధవారం యడ్లపాడు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. ఈ ఘటనలో దాసరిపాలెం గ్రామానికి చెందిన బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థి కొర్నెపాటి తేజ(19) కొండగట్టుపై నుంచి క్వారీనీటి కుంటలో పడి ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. అయితే, తన కుమారుడిది ఆత్మహత్య కాదని, ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని తేజ తండ్రి కొర్నెపాటి మహేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మే 5వ తేదీ రాత్రి తేజ స్నేహితుడు కోటిరెడ్డితో కలిసి చౌడవరం శివారులోని ప్రైవేటు వసతి గృహంలో ఉన్న మిత్రుడి గదికి చదువుకోడానికి వెళ్లాడు. మంగళవారం ఉదయం స్నేహితులు తండ్రి మహేష్ వద్దకు వచ్చి తేజ, కీర్తనలు ప్రేమలో ఉన్నారని, పెద్దల నిరాకరణతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డారని తెలిపారు. వారిద్దరూ చౌడవరం బాలకుటీర్ పాఠశాల వెనుక ఉన్న క్వారీ నీటి గుంటలో దూకారని చెప్పిన స్నేహితులు, కీర్తనను అప్పటికప్పుడు కాపాడినట్లు మహేష్‌కు చెప్పారు. అయితే, తేజ కనిపించకపోవడంతో తండ్రి సంఘటనా స్థలానికి చేరుకుని కుంట వద్ద తేజ చెప్పులు గుర్తించాడు. స్థానికుల సహాయంతో గుంటలో నీటిని తోడించగా మృతదేహం వెలికి తీశారు. ఈ సంఘటనపై తేజ తండ్రి కుమారుడి మృతిపై కీర్తనతో పాటు స్నేహితులు కోటిరెడ్డి, చందులపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. యడ్లపాడు ఎస్ఐ టి.శివరామకృష్ణ ఈ కేసును అనుమానాస్పద మృతిగా నమోదు చేసి, పూర్తిస్థాయి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. తేజ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబానికి అప్పగించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ నర్సింగ్(Girls) MLT పెటర్నరీ, అగ్రికల్చర్, ఫిజియోథెరపీ కోర్సులకు అడ్మిషన్లు జరుగుచున్నవి. బాల బాలికలు హాస్టల్ వసతి కలదు. 7386706839, 7780494333

REAL ESTATE

■ అమరావతి మునుగోడు వద్ద ఎర్రచందనం చెట్లు 60 అడుగుల రోడ్డులో వెంచర్ వేసిన దానికి ప్రక్కన 1.10 సెంట్లు 80ల. 9502736614, 9949284105

SERVICES

GOLD FINANCE

■ బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ✆ 88024 89999

HOME CARE SERVICE

■ లలిత హోం కేర్ సర్వీస్, విజయవాడ. వృద్ధులకు, పేషంట్ల సేవకు ఇంటిపని / వంట పని / బేబీకేర్ కొరకు M/F వర్కర్లను 24/7 మీ ఇంటికి పంపగలము ✆ 97054 91122, 94932 46482

WANTED

■ గుంటూరులోని హాస్పిటల్స్ నందు ఫిమేల్ నర్సింగ్ సూపరింటెండ్ ANM, GNM నర్సింగ్ స్టాఫ్ M/F లేడీ రిసెప్షన్ ఆయాలు యువకులు కావలెను. 7997777108

■ ప్రముఖ ఇంటి ఆహార వాణిజ్య సంస్థ హోమ్ థాలి గుంటూరు నందు ఫుడ్ ప్యాకింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. 9505012666, 9381982818

■ మాధవి హోటల్స్ నందు షిఫ్టుల వారిగా పని చేయుటకు జెంట్స్ అండ్ లేడీస్ మేనేజర్ మరియు బాయ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ వెంకట్. 9010453888

■ అమరావతి హైకోర్టు వద్ద గల కంపెనీలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. జీతం 17500, 12గం॥ డ్యూటీ. 8848062846, 9493803047

■ గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజ్ నందు క్యాంపస్ ఇన్‌ఛార్జ్, బ్యాచ్ ఇన్‌ఛార్జ్‌గా పని చేయుటకు పురుషులు కావలెను. జీతము 12,000/- నుండి 21000/- వరకు ఇవ్వబడును. (నాన్ లోకల్ వారికి ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యా అర్హతలు: ఇంటర్ నుండి పి.జి వరకు. వయస్సు 21 సంవత్సరాలు నుండి 45 సంవత్సరాలు ఉండవలెను. సంప్రదించగలరు. ఫోన్ నెంబర్ : 9154152896

■ Wanted Male Administrative Staff Qualification Any Degree/PG. Age Limit 25 to 45years, Salary Upto: 20,000/- location: Master Minds College, Nellore, Interested Candidates may whatsapp their Resume to the Contact Number. 8978480430

■ వంటమనిషి కావలెను. గుంటూరు పట్టణంలో ఏ.టి. అగ్రహారం నందు గృహములో వెజ్ మరియు నాన్‌వెజ్ అన్నిరకముల వంటలు చేయుటకు అనుభవము కలిగిన (ఆడ) వంట మనిషి కావలెను. ✆ 9398991579

■ డ్రైవర్స్ కావలెను. ఆటోమెటిక్ మరియు మాన్యువల్ కారు నడిపిన అనుభవం ఉండవలెను. తగిన లైసెన్స్ ఉండాలి. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. అర్హతను బట్టి PF మరియు ESI సదుపాయం కలదు. పనిచేయు స్థలం: గుంటూరు. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్. 92487 22282

■ ప్రముఖ బ్యాంకింగ్ రికవరీ ఏజెన్సీ నరసరావుపేట, చిలకలూరిపేట, తెనాలి, చీరాల, గుంటూరు Local ఏరియాలలో పని చేయుటకు కావలెను. "Field Executives" (Salary 15K to 22K +Inct) సంప్రదించండి ✆ 92484 86177

■ గుంటూరు నందు పనిచేయుటకు టెలికాలర్స్ (F) ప్రమోటింగ్ టీం (M) కావలెను. Q: Any Degree, English Fluency is Must. అనుభవానికి ప్రాధాన్యత. జీతం: 15k to 20k. Freshers can Also Apply. ✆87499 77799

■ గుంటూరు శ్రీ శివం గ్రూప్ సంస్థ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న అమరావతి రాజధాని ప్రాంతంలో వెంచర్స్‌ను మార్కెటింగ్ చేయుటకు అనుభవం కలిగిన మార్కెటింగ్ సిబ్బంది & ఆఫీస్ స్టాఫ్ కావలెను. ఫోన్: 98488 30615

■ విద్యాసంస్థ నందు పనిచేయుటకు లేడీ టెలికాలర్స్ కావలెను. అరండల్‌పేట 10 లైను, గుంటూరు. సంప్ర॥ ✆ 8328639434 / 9059314217

■ దుగ్గిరాల ప్రముఖ కాఫీ పరిశ్రమకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను జీతం: 16,000/- వీక్లీ ఆఫ్, క్యాంటీన్, రూమ్ సౌకర్యం కలదు ✆ 92980 11777, 81427 61777

■ శివకార్తికేయ హోంకేర్‌లో వృద్ధులను,పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావాలి. ఫ్రీ వసతి భోజనం. జీ: 18K. ఫోన్: 9912011499, 9912011899

సాక్షి క్లాసిఫైడ్స్ గుంటూరు ప్యాక్ రూ. 475/- మాత్రమే (4 లైన్లు) ప్రతి అదనపు లైను రూ.100 మాత్రమే ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం

ఈ పేపర్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి గుంటూరు 7075167663 7075167541

గమనిక: సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశేషంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

తొండపిలో పోలీసుల కార్డన్ సెర్చ్



స్వాధీనం చేసుకున్న వాహనాలను పరిశీలిస్తున్న డీఎస్పీ హనుమంతరావు, పోలీసు సిబ్బంది

తొండపి(ముప్పాళ్ళ): మండలంలోని తొండపి గ్రామంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు ఆధ్వర్యంలో బుధవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో జరిగిన చిన్నపాటి ఘర్షణ, ఫ్యాక్షన్ నేపథ్యంలో శాంతిభద్రతల దృష్ట్యా ముందస్తు చర్యలలో భాగంగా గృహాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. ప్రతి ఇంటిని, దుకాణాలను సోదాలు చేశారు. పలు ఇళ్లలో మారణాయుధాలు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో గంజాయి అమ్మకాలు జరుపుతున్నట్లు తమ దృష్టి వచ్చిందని, అసాంఘిక నేరాలకు పాల్పడే వారిపై పోలీసు నిఘా ఉంటుందన్నారు. సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని 60 మంది పోలీసు సిబ్బంది ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. ఎటువంటి పత్రాలు లేని 35 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సత్తెనపల్లి రూరల్ సీఐ కిరణ్, స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ సుబ్బారావు, ముప్పాళ్ల ఎస్ఐ వి.సోమేశ్వరరావు, సబ్ డివిజన్ పరిధిలోని ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ మహిళలకు ఉచితంగా కుట్టు, కంప్యూటర్ శిక్షణ

నరసరావుపేట ఈస్ట్: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీ నుంచి ఎస్సీ మహిళలకు మూడు నెలల పాటు ఉచితంగా కుట్టు, కంప్యూటర్ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ.తమ్మాజీరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసీ), ఎస్సీ కార్పొరేషన్ సంయుక్తంగా ఈ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు వివరించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం సమీపంలోని ఎన్ఏసీ శిక్షణ కేంద్రంలో ఈ తరగతులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆసక్తి గల ఎస్సీ సామాజిక మహిళలు ఆధార్, కుల ధ్రువీకరణ, విద్యార్హత సర్టిఫికెట్లతో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, ఆధార్ లింక్ మొబైల్ ఫోన్‌తో ఎన్ఏసీ కేంద్రంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9394102075, 9985496190 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

రెంటాలలో 22 గేదెల దొంగతనం

రెంటచింతల: మండలంలోని రెంటాల గ్రామంలో 22 గేదెలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సీహెచ్ నాగార్జున బుధవారం తెలిపారు. గ్రామంలోని కటికల సంసోన్, పేరుపోగు ఇస్రాయేల్, కటికల యేసయ్య, చిలక మరియమ్మలకు చెందిన 22 గేదెలు ఏప్రిల్ 26న మేత కోసం పొలం వెళ్లి సాయంత్రానికి ఇంటికి తిరిగిరాలేదు. చుట్టుపక్కల గ్రామాలలో గాలించినా కనిపించపోవడంతో, ఎవరైనా దొంగిలించి ఉంటారని నిర్ధారణకు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీకి గురైన గేదెల విలువ సుమారు రూ. 3.90 లక్షలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. కొందరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని ఎస్ఐ తెలిపారు..

ధర్మకర్తల మండలికి దరఖాస్తు చేసుకోండి

రెంటచింతల: మండలంలోని సత్రశాల వద్దనున్న అతి పురాతన శైవక్షేత్రమైన శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి నియామకం చేపడుతున్నామని, ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని ఎండోమెంట్ ఈఓ గాదె రామిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన కార్యవర్గం ఏర్పాటుకు సంబంధించి కమిషనర్ దేవదాయశాఖ గొల్లపూడి విజయవాడ వారు నోటిఫికేషన్ జారీ చేశారని పేర్కొన్నారు . పూర్తిచేసిన దరఖాస్తును ఈ నెల 26 తేదీలోపు పల్నాడు జిల్లా దేవదాయ శాఖ అధికారి నరసరావుపేట వారికి నేరుగా అందజేయాలని సూచించారు. దరఖాస్తుల కోసం దేవదాయ శాఖ సత్తెనపల్లి ఇన్‌స్పెక్టర్‌ను సంప్రదించాలని ఆయన తెలిపారు.

అంతర్‌రాష్ట్ర దొంగ అరెస్ట్

- తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలు
- రెండు తెలుగు రాష్ట్రాల్లో పదికి పైగా కేసులు
- అతనికి సహకరించిన మరో ముగ్గురు అరెస్టు
- బంగారు ఆభరణాలు స్వాధీనం



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఎం.వి.చరణ్, పక్కన ఎస్ఐలు వంశీకృష్ణ, అరుణ

నరసరావుపేటటౌన్: తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడుతున్న అంతర్‌రాష్ట్ర దొంగను అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి 70 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు వన్ టౌన్ సీఐ ఎం.వి.చరణ్ తెలిపారు. బుధవారం స్టేషన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. ప్రకాష్‌నగర్‌కు చెందిన వెల్లలచెరువు వెంకట శివరామకృష్ణ బల్లికురవ మండలం, గుంటుపల్లి గ్రామంలో వీఆర్ఓగా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 2వ తేదీన ఇంటికి తాళాలు వేసి కుటుంబంతో దైవదర్శనానికి వెళ్లాడు. తాళాలు పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించిన దుండగులు బీరువాలోని బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు అపహరించుకు వెళ్లారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామన్నారు. ఇంటివద్ద లభ్యమైన సీసీ పుటేజ్ ఆధారంగా తెలంగాణ రాష్ట్రం సిద్దిపేట జిల్లా, కొండపాక మండలం, బందారం గ్రామానికి చెందిన దుద్దేలింగంగా గుర్తించామన్నారు. నిందితుడి కోసం గాలిస్తుండగా అతనితో పాటు మరో ముగ్గురు చోరీ సొత్తును పంచుకుని విక్రయించేందుకు వెళుతూ రైల్వే స్టేషన్ వద్ద పట్టుబడ్డారని తెలిపారు. నలుగురి వద్ద నుంచి బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నిందితుడిపై రాష్ట్రంలోని పలు పోలీస్ స్టేషన్‌లలో తొమ్మిది కేసులు నమోదు అవ్వగా, తెలంగాణ రాష్ట్రంలో కూడా పలు దొంగతనం కేసుల్లో నిందితుడుగా ఉన్నట్లు విచారణలో తేలిందన్నారు. నిందితులను చాకచక్యంగా పట్టుకోవడంలో కృషి చేసిన ఎస్ఐ వంశీకృష్ణ, సిబ్బంది వీరాంజనేయులు, మురళీకృష్ణలను పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు అభినందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం

విజయపురి సౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 513.60 అడుగుల వద్ద ఉంది. ఇది 137.8642 టీఎంసీలకు సమానం.